
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 ఏప్రిల్ 2024



రాక్షసపాలన సాగిస్తున్న జగన్ సర్కారును గద్దె దించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి (ఎన్డీయే)గా ఏర్పడ్డాయి. వీటికి సీట్ల సర్దుబాటు అయిపోయింది. బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటించారు. అయితే సీఎం జగన్ సొంత జిల్లాలో వైసీపీ సైన్యాన్ని మరింత సమర్థవంతంగా ఎదుర్కొని ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ఇంటింటికీ తీసుకెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. వచ్చే నెల 13న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ ప్రతి గంట ముఖ్యం. పొత్తు పెట్టుకోవడంతో పని అయిపోదు.. పార్టీల మధ్య సమన్వయం ముఖ్యం. అంతకన్నా ముందు ఓటు బదిలీ జరగాలి. అప్పుడే పొత్తు లక్ష్యం నెరవేరుతుంది. అందుకు తగ్గట్లుగానే కూటమి నేతలు జట్టుగా జనం వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

జట్టుగా.. జనం వద్దకు

- ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదు
- ప్రతి ఓటు కూటమి అభ్యర్థులకు పడేలా చూడాలి
- వైసీపీ దుష్ప్రచారాన్ని వెంటనే ఖండించాలి
- మూడుపార్టీలు కమిటీగా..
- కూటమి తరపున ప్రతి ఇంటికీ మూడుసార్లు వెళ్లాలి
- వైసీపీని గద్దెదింపేందుకు వ్యూహాత్మకంగా టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అడుగులు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూటమి పొత్తులో భాగంగా జమ్మలమడుగు, బద్వేలు అసెంబ్లీ స్థానాలను బీజేపీకి కేటాయించారు. కడప పార్లమెంటు, కడప, కమలాపురం, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ పోటీ చేస్తుంది. ఇక ఉమ్మడి కడప జిల్లాలో జనసేనకు రైల్వేకోడూరును కేటాయించారు.

కలిసికట్టుగా ముందుకు

కడప పార్లమెంటు పరిధిలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కలిసి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా జమ్మలమడుగు, బద్వేలు స్థానాలను బీజేపీకి కేటాయించారు. బద్వేలు నుంచి బీజేపీ అభ్యర్థిగా రోశన్న బరిలో ఉన్నారు. ఈయన టీడీపీ నుంచి పోటీ చేయాలని భావించి దాదాపు ఆరునెలల పాటు బద్వేలు నియోజకవర్గంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీతో తిరిగారు. అనంతరం ఆయన బీజేపీలో చేరారు. పొత్తులో బద్వేలు టికెట్ బీజేపీకి కేటాయించడంతో ఇక్కడి నుంచి రోశన్న పోటీ చేస్తున్నారు. బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు రితీశ్‌కుమార్‌రెడ్డిలు టీడీపీ బీజేపీ జనసేనతో కలిసి ఇప్పటికే ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేశారు. ప్రతి ఓటు అసెంబ్లీకి బీజేపీకి పార్లమెంటుకు టీడీపీకి పడేలా నేతలతో చర్చించారు. ఇక జమ్మలమడుగులో బీజేపీ నుంచి మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. రెండురోజుల క్రితం కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డితో కలిసి టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శనివారం కడపలో టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, జనసేన సుంకర శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడగు బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి, కడప అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డితో పాటు ముఖ్యనేతలంతా హాజరయ్యారు.

సమన్వయంతో..

జగన్‌ను సొంత జిల్లాలో దెబ్బకొట్టేందుకు టీడీపీ బీజేపీ జనసేన కూటమి కలిసికట్టుగా ముందుకెళ్లాలని, ప్రచారం మొదలు ప్రతి దాంట్లోనూ సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా మూడు పార్టీలతో కూడిన కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ప్రచార కార్యక్రమాలు ఎక్కడెక్కడ నిర్వహించాలి, కూటమిపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే తిప్పికొట్టడం, ఎన్నికల నిబంధనలకు వైసీపీ ఉల్లంఘిస్తే వెంటనే స్పందించి ఈసీకి ఫిర్యాదు చేయడం.. ఇలా ప్రతి విషయంలో కలిసికట్టుగా వెళ్లనున్నారు. ఇంటింటికీ కూటమి మేనిఫెస్టోను తీసుకెళ్లడం, ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, రాక్షస పాలన, ప్రశ్నించే వారిపై దాడులు, కేసులు, సంక్షేమం పేరిట కరెంటు చార్జీలు, ఇంటి పన్ను, చెత్తపన్ను, కుళాయి పన్నుల గురించి ఇంటింటికీ వివరించడం.. చంద్రబాబు సీఎం అయితే కుటుంబాలకు జరిగే లబ్ధి గురించి వివరించనున్నారు. పోలింగ్‌లోపు ప్రతి ఇంటికీ మూడుసార్లు వెళ్లేలా నిర్ణయించారు. కూటమి అభ్యర్థులు, సానుభూతిపరులను వైసీపీ ఇబ్బందులు పెట్టినా కలిసికట్టుగా వెళ్లాలని, రాష్ట్ర నాయకత్వం చెప్పిన విధంగా మనమంతా నడవాలని, జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేయాలి అని నిర్ణయించుకున్నారు. నియోజకవర్గాలవారీగా కమిటిలు ఏర్పాటు చేసుకోనున్నారు. సోమవారం కడప అసెంబ్లీకి సంబంధించి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కమిటీ ఏర్పాటు కానుంది. అదే రోజు డిప్యూటీ సీఎం ఐదేళ్ల పాలనపై చార్జిషీటు దాఖలు చేయనుంది. ఇక అన్ని నియోజకవర్గాల్లో ఇలాగే జరగనుంది. బద్వేలు, జమ్మలమడుగులో అసెంబ్లీ స్థానాలకు బీజేపీ పోటీ చేస్తోంది. అయితే ఇక్కడ టీడీపీ, జనసేన ఓట్లతో పాటు సానుభూతి పరుల ఓట్లను అసెంబ్లీ స్థానానికి బీజేపీకి.. పార్లమెంటు స్థానానికి టీడీపీకి మిగతా నియోజకవర్గాల్లో జనసేన బీజేపీ ఓట్లను రెండు ఓట్లూ టీడీపీ అభ్యర్థులకు వేసే విధంగా బూత్ కన్వీనర్లకు ఇంటింటికీ వెళ్లి జనాలకు వివరించాలని నిర్ణయించారు.



కడపలో జరిగిన పార్లమెంట్ స్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు

జగన్‌రెడ్డివి శవరాజకీయాలు

- వాటిని తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలి
- వైసీపీ వైఫల్యాలను ప్రజల మధ్య ఎండగట్టాలి
- పోలింగ్ రోజున అరాచకాలకు తెగబడితే ధైర్యంగా ఎదుర్కోవాలి
- గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి
- కడప పార్లమెంట్ స్థాయి సమన్వయ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 6: వృద్ధులైన అవ్వాతాతలకు ఇంటివద్ద పెన్షన్ ఇవ్వకుండా వారిని మండుటెండలో ఇబ్బందులు పడేలా సచివాలయాలకు రప్పించి పైశాచిక ఆనందం పొందుతున్న జగన్‌రెడ్డి శవరాజకీయాలను తిప్పికొట్టేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ, బీజేపీ, జనసేన జిల్లా ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. శవాలతో రాజకీయం చేయడం జగన్‌రెడ్డికి అలవాటనే సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. నాడు తండ్రి శవాన్ని అడ్డుపెట్టుకొని నీచ రాజకీయాలకు పాల్పడగా.. గత ఎన్నికలకు ముందు ఆయన స్వంత చిన్నాన్న శవాన్ని అడ్డుపెట్టుకుని మరింత దిగజారి రాజకీయ లబ్ధి పొందారన్నారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలనే కుట్రతో పెన్షనర్స్‌ను పావులుగా వాడుకోవడం దారుణమన్నారు.

రానున్న ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపై శనివారం స్థానిక మయూర గార్డెన్‌లో కడప పార్లమెంట్ స్థాయి ఉమ్మడి సమన్వయ సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఉమ్మడి అభ్యర్థులు, పార్లమెంట్ అభ్యర్థితో పాటుగా ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జరిపిన పాదయాత్రలో జగన్‌రెడ్డి అలవికాని హామీలను గుప్పించారన్నారు. ఆ మేరకు ఉక్కుఫ్యాక్టరీ, షుగర్‌ఫ్యాక్టరీ, పాలఫ్యాక్టరీ, కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, శ్రీశైలం నుంచి కడపకు నీరు, పెన్నా నుంచి నీరు, కొప్పర్తి పారిశ్రామికవాడలో 10వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలను గాలికి వదిలేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని వైసీపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకులు సిద్ధం కావాలన్నారు.

ముఖ్యంగా పండుటాకులకు ఇచ్చే పెన్షన్‌తో కూడా కొత్త డ్రామాలకు తెరతీయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పైపెచ్చు ఆ నిందను తమ పార్టీ అధినేత చంద్రబాబుపై నెట్టేలా కార్యాచరణకు ఉపక్రమించిన తీరు సరైందికాదన్నారు. ఏది ఏమైనా చంద్రబాబు మరో అడుగు ముందుకేసి అవ్వా తాతలకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్‌ను టీడీపీ విజయం సాధించగానే 4వేలు చేస్తామని, అది కూడా ప్రస్తుత ఏప్రిల్ నుంచి అందజేస్తామని ప్రకటించడం మిక్కిలి హర్షణీయమన్నారు.

అనంతరం కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థులు ఆర్.మాధవిరెడ్డి, వరదరాజులురెడ్డి, ఆదినారాయణరెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, నాయకులు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జిల్లా నేత జిలానీ బాష, జనసేన నాయకులు పత్తి వినోద్‌కుమార్, మాట్లాడారు. జగన్‌రెడ్డి అరాచకపాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. పచ్చి అబద్ధాలను వల్లెవేయడంలో, అలాగే సినిమా నటులను సైతం తలదన్నేలా ఇటీవల బస్సుయాత్రలో జగన్‌రెడ్డి నట విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్న తీరుని ఎద్దేవా చేశారు. ఓ వైపు ఆయన స్వంత చెల్లెళ్లు కూడా జగన్‌రెడ్డిని విశ్వసించడం లేదన్నారు. స్వంత చిన్నాన్నను చంపిన వైఎస్ అవినాశ్‌రెడ్డిని దగ్గరపెట్టుకొని కడప ఎంపీ సీటు ఇవ్వడం దారుణమన్నారు. ఇలాంటి వ్యక్తిని మరో సారి ముఖ్యమంత్రిని చేస్తే అడ్డు చెప్పేవారిని ప్రాణాలతో వుంచబోరన్నారు. ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైసీపీ ప్రలోభాలకు, ఒత్తిడులకు గురికాకుండా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మాలే శివ, తుంగా రమణయ్య, బీజేపీ నాయకులు వీవీ చలపతి, గోసుల శ్రీనివాసులురెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, పుప్పాల శ్రీనాథరెడ్డి, కర్నాటి యల్లారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కడప పార్లమెంట్ స్థాయి ఉమ్మడి సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

పెద్దదర్గా వెలుపల మీడియాతో మాట్లాడుతున్న కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల



ఎంపీగా ఏం సాధించారు?

- ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారా..?
- ప్రత్యేక హోదా.. రైల్వేను పట్టించుకోకుండా గాడిదలు కాస్తున్నారా?
- వివేకా హత్యకేసు నిందితుడు అవినాశ్‌రెడ్డిని ఓడించండి
- కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అందరికీ న్యాయం
- కడప ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

"ఇన్నాళ్లు ఎంపీగా ఉండి ఏమి సాధించారు..? రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప బెంగళూరు రైల్వే లైను పట్టించుకోకుండా ఐదేళ్లు గాడిదలు కాస్తున్నారా.." అంటూ కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. తమ చిన్నాన్న వివేకానందరెడ్డిని అతి కిరాతకంగా చంపించిన నిందితుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించాలని, రాజశేఖర్ రెడ్డి బిడ్డనైన తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆమె జిల్లా ప్రజలను అభ్యర్థించారు.

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 6: కాంగ్రెస్ తరఫున కడప ఎంపీ స్థానానికి పోటీచేస్తున్న వైఎస్ షర్మిల చేపట్టిన బస్సుయాత్ర రెండోరోజు శనివారం కడప నగరంలో సాగింది. పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలసి ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పెద్దదర్గాలో, దేవుని కడపలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, మరియాపురం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పెద్దదర్గా, చిన్నచౌకు, ఐటీఐ, ఏడురోడ్ల కూడళ్లలో షర్మిల ప్రసంగించారు. వైఎస్ అవినాశ్‌రెడ్డి ఎంపీగా ఏమి సాధించారో తెలపాలని సవాల్ విసిరారు. ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోలేదని, దీంతో జిల్లాలో లక్షలాది మంది యువతకు ఉపాధి లేకుండా చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కడప-బెంగళూరు రైల్వే లైను తెస్తే అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. ఎంపీగా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి పాటుపడకుండా గాడిదలు కాస్తున్నారా? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ ఆశయాలను జగన్‌రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. తండ్రిని చంపిన బాధలో సునీతమ్మ న్యాయస్థానాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. అయితే తండ్రిని ఆమే చంపిందని నింద మోపడం ఈ దుర్మార్గులకే చెల్లిందన్నారు. చిన్నాన్నను చంపిన వారికి శిక్ష పడాలని, వైఎస్సార్‌కు ఆత్మశాంతి కలిగించాలని తాను కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా అన్నారు. అయితే కొందరు జగన్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని తనను వైఎస్ రాజశేఖర్ రెడ్డికే పుట్టలేదనడం బాధాకరమన్నారు. అంటే వాళ్ల స్వార్థం కోసం తన తల్లి విజయమ్మను కూడా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఎంతో ప్రేమ అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఆయన పనిచేశారన్నారు. ఆయన ఆశయాలు సాధించేందుకు ఆయన బిడ్డగా, ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీలోనే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. తాను కడప బిడ్డనని, అందరికీ అందుబాటులో ఉండీ ప్రతి ఒక్కరి సమస్యలు తీరుస్తానన్నారు. హత్య కేసు నిందితుడు అవినాశ్‌రెడ్డికి.. రాజశేఖర్ రెడ్డి బిడ్డనైన తనకు మధ్యజరిగే ఈ పోటీలో తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, సంఘ సేవకులు సలాఉద్దీన్, సీపీఐ నేతలు గాలి చంద్ర, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఎస్ షర్మిల బస్సుయాత్రలో భాగంగా మూడోరోజు ఆదివారం కమలాపురంలో పర్యటించనున్నారు.



వైఎస్ షర్మిల నిర్వహించిన బస్సుయాత్రకు ఐటీఐ కూడలి వద్ద హాజరైన జనం

ఈసీ హెచ్చరించినా.. వీళ్లు మారరా..?

చిన్నమండెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీ కార్యక్రమాలకు దూరంగా వలంటీర్లు ఉండాలని ఎన్నికల కమిషన్ పదేపదే హెచ్చరించినా.. వలంటీర్లకు చీమకు కుట్టినట్టు కూడా కనిపించడం లేదు. కేశాపురం గ్రామ పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈయనతో పాటు ఏడుమంది వలంటీర్లు, ఒక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వీరిలో కొందరు ఎన్నికల ప్రచారంలో అంతా తామై ఎమ్మెల్యేని ఇంటింటికీ తీసుకెళ్లి.. ఓటర్లకు సంక్షేమ పథకాలు వివరించారు. ఈ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు సాంబశివ, ప్రశాంత్, ఆదినారాయణ, భార్గవ్, మహిళా వలంటీర్లు లక్ష్మీప్రసన్న, జ్యోతి, సోమేశ్వరితో పాటు ఒక ఫీల్డ్ అసిస్టెంటు కూడా పాల్గొన్నారు వీళ్లందరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం నిబంధనలకు విరుద్ధమని వీళ్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా.. ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదన్నారు.



ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

జీతాలో జగనన్నా..!





- వైఎస్సార్ క్యాన్సర్ కేర్, గవర్నమెంట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో.. నాలుగు నెలలుగా అందని వేతనాలు
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు
- ఉగాది, రంజాన్ పండగలకైనా జీతాలొచ్చేనా?

(కడప-ఆంధ్రజ్యోతి): వేతనజీవులకు ప్రతినెలా ఠంచనుగా 1వతేదీ జీతాలొస్తే కానీ బతుకు బండి దొల్లదు. అలాంటిది నెల రెండు నెలలు కాదు... ఏకంగా నాలుగు నెలల పాటు జీతాలు రాకపోతే వారి పరిస్థితి ఎలాగుంటుంది.. దయనీయంగా ఉంటుంది. రిమ్స్ ఆసుపత్రి ఆవరణలోని వైఎస్సార్ క్యాన్సర్ కేర్, గవర్నమెంట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఉద్యోగుల పరిస్థితి ప్రస్తుతం అలానే ఉంది. సీఎం జగన్ గత ఏడాది డిసెంబరు 23న సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ కేర్ ఆసుపత్రులను ఆర్భాటంగా ప్రారంభించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం కడపలోనే అందుతుందని గొప్పగా చెప్పుకొచ్చారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య, వైద్యేతర సిబ్బందిని కొంతమేర భర్తీ చేశారు. అయితే వీరికి నాలుగు నెలలుగా జీతాలు మాత్రం ఇవ్వలేదు.

88 మంది ఎదురుచూపులు

కొందరు ఉద్యోగులు వేతనాలపై ఆధారపడి బతుకుతుంటారు. ఆ సొమ్ముతోనే ఇంటి అద్దె, పిల్లల చదువు, సేవింగ్స్, పెళ్లిళ్ల ఇతరత్రా.. ఇల్లు కొనాలన్నా బండి కొనాలన్నా ఈఎంఐలు కట్టాలన్నా వచ్చే జీతాలపైనే ఆధారపడి ఉంటారు. బ్యాంకులతో పాటు ప్రైవేటు ఫైనాన్స్‌లు విరివిగా రుణాలు ఇస్తుంటాయి. జీతాలను బట్టి ద్విచక్ర వాహనాలు కొంటే మరికొందరు కార్లు ఇతర వాటిని కొనుక్కుంటారు. ఇంటికి అవసరమైన విద్యుత్ గృహోపకరణాలు తీసుకుంటారు. వీటన్నింటికీ ఈఎంఐలు చెల్లిస్తుంటారు. అయితే రిమ్స్ వద్ద సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ కేర్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 88 మంది వైద్య వైద్యేతర సిబ్బందికి ఆసుపత్రి ప్రారంభం నుంచి ఇంతవరకు జీతాలు అందలేదు. దీంతో వీరు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పులు తెచ్చి నెట్టుకొస్తున్నారు.

పండగకైనా..

కొత్తగా ఆసుపత్రి ప్రారంభం కాడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు కడపలో అద్దె ఇళ్లు తీసుకుని ఉన్నారు. జీతాలు వస్తాయి వస్తాయిలే అనుకుని నాలుగునెలలు గడిచింది. దగ్గర్లో హిందువులకు తెలుగు సంవత్సరాది ఉగాది, ముస్లింలకు రంజాన్ లాంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. కనీసం పండక్కి అయినా జీతాలు వస్తాయో రావోననే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. సిబ్బందితో పనిఅయితే చేయించుకుంటున్నారు కానీ జీతాలు గురించి అడిగే నాధుడే లేడంటూ వాపోతున్నారు. జీతాల కోసం డయోగ్రామ్ మెడికల్ (డీఎంఈ) హెడ్ అకౌంటు క్రియేట్ చేసి ట్రెజరీ ద్వారా జీతాలు అందించాల్సి ఉంది. అయితే ఇంత వరకు వీరికి అకౌంటు క్రియేట్ కాలేదని చెబుతున్నారు.

అకౌంట్ క్రియేట్ చేసేందుకూ ఆమ్యామ్యాలు

జీతాల కోసం ఉద్యోగులు అవస్థలు పడుతుంటే.. దానిని అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులు క్యాష్ చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. అకౌంటు క్రియేట్ చేసిస్తామంటూ ఒక్కో ఉద్యోగి నుంచి వారి స్థాయి, వేతనం బట్టి రూ.2వేల నుంచి రూ.3వేలు వరకు వసూలు చేసినట్లు చెబుతారు. ఇకనైనా జీతాలు వ స్తాయనుకుంటే.. చావు కబురు చల్లగా చెప్పినట్లు మీరిచ్చిన డబ్బులు దారి ఖర్చులకే అయిపోయింది మరలా డబ్బులు అవసరమంటూ అడుగుతున్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రి ప్రారంభించగానే గొప్పలు చెప్పుకోవడం తప్ప అందులో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు ఇవ్వరా అంటూ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ విషయమై సూపర్‌స్పెషాలిటీ సూపరింటెండెంట్ సర్వేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా, త్వరలోనే అందరికీ జీతాలు వస్తాయన్నారు.

శ్రీనివాసులు హత్య కేసులో ఐదుగురు అరెస్టు

● పూర్తిస్థాయిలో విచారిస్తున్నాం : కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప (క్రైం), ఏప్రిల్ 6: పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లె పొలాల్లో ఏప్రిల్ 2వతేదీన జరిగిన ఆదిమూలం శ్రీనివాసులు హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. కడప డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హత్య కేసులో నిందితులైన చిన్నగుర్విరెడ్డి గారి నాగిరెడ్డి ఆలియాస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి ఆలియాస్ చిన్న నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి ఆలియాస్ డేగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో మరికొందరిని కూడా అరెస్టుచేయాల్సి ఉందన్నారు. వివరాల్లోకి వెళితే... ఏప్రిల్ 2న చిన్నదాసరిపల్లె పొలాల్లో అనుమానాస్పద స్థితిలో చనిపోయిన శ్రీనివాసులు హత్యపై మృతుడి తమ్ముడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెండ్లిమర్రి పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటైన స్పెషల్ టీమ్స్ ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కడప - పులివెందుల ప్రధాన రహదారిలోని కాశినాయన గుట్ట వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. చిన్నగుర్విరెడ్డి గారి నాగిరెడ్డి వద్ద నుంచి టీ షర్టు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ హత్యకు భూ సమస్య ప్రధాన కారణమని తెలుస్తోందన్నారు. సదరు గ్రామ పరిధిలో 70 సెంట్లు భూమి సంబంధించి సమస్య ఇరువర్గాల మధ్య తలెత్తినట్లు తెలిపారు. ఈ సమస్యల్లో భాగంగానే ఈ హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉందని, మరికొందరి ప్రమేయం ఉందని పూర్తి వివరాలు తెలియగానే అనుమానితులను కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టరు కంభగిరి రాముడు, కడప రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో 'వైవీయూ' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 6: జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి అభినందించారు. వైవీయూ లలిత కళల విభాగం విద్యార్థులు ఈ ఏడాది జనవరిలో జరిగిన దక్షిణ భారతదేశ యువజనోత్సవాల్లో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించారన్నారు. నుదియానా, పంజాబ్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవ పోటీల్లో దాదాపు 108 యూనివర్సిటీలు పోటీ పడగా, వారిలో వైవీయూ విద్యార్థులు వై.అరవింద్ కార్టూన్ విభాగంలో ద్వితీయ స్థానం, రమాజ్యోతి రంగోలి విభాగంలో తృతీయ స్థానం, దేవదాస్ పోస్టరు విభాగంలో తృతీయ స్థానం, శ్రీలత మెహందీ ఆర్ట్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విజేతలుగా విశ్వవిద్యాలయానికి చేరుకుని యూనివర్సిటీ కల్చరల్ కో ఆర్డినేటరు ప్రొఫెసరు విజయభారతి, లలితకళల శాఖ విభాగాధిపతి మృత్యుంజయరావు బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసరు పుత్తా పద్మ, కాత్యాయని ఆధ్వర్యంలో వీసీని వారు ఆయన చాంబరులో కలిశారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ విభాగాధిపతి కోటా మృత్యుంజయరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'తప్పుడు అంకెలతో కరపత్రాలు పంచడం శోచనీయం'



విలేకరులతో మాట్లాడుతున్న జిలాన్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6: ఎన్నికల నియమ నిబంధనలు పక్కనబెట్టి మసీదు ఆవరణలో అబద్దపు అంకెల గారడీ కరపత్రాలు పంచడం భావ్యం కాదని టీడీపీ నేత జిలాన్ తెలిపారు. శనివారం కడప నగరం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్ర బడ్జెట్ 2.79 లక్షల కోట్లు ఉంటే ముస్లిం మైనార్టీలకు రూ.12 లక్షల కోట్లు ఇచ్చామనడం విడ్డూరంగా ఉందన్నా రు. తప్పుడు లెక్కలు, రాతలతో కరపత్రాలు పంచడం వైసీపీకే చెల్లు అన్నారు. మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిసెంట్ జిలానీబాషా, నాయకులు ఖాజాపీర్, బీబీ, డైమండ్ మహబూబ్‌ఖాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్

రేణిగుంట వరకు పని చేయని నెట్‌వర్క్ ● అందుబాటులో లేని సిబ్బంది

ఇతర నెట్‌వర్క్‌లకు వెళుతున్న వినియోగదారులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 6: బీఎస్ఎన్ఎల్ అంటే పేరు కాదు బ్రాండ్. ఒకప్పుడు దేశంలో ప్రతి ఒక్కరికీ బీఎస్ఎన్ఎల్ విశిష్టమైన సేవలు అందించేది. అత్యుత్తమైన సేవలు అందించే బీఎస్ఎన్ఎల్ ప్రైవేట్ కంపెనీలకు దీటుగా వినియోగదారులకు సేవలు అందిస్తూ ఎక్కడికి వెళ్లినా నెట్‌వర్క్ అందుబాటులో ఉండేది. ప్రస్తుతం వినియోగదారులను కోల్పోతూ తిరోగమన దిశలో ఉంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు కనుమరుగేయ్యే పరిస్థితి దాపురించిది. ముఖ్యంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో సేవలు అందుబాటులో ఉన్నా గ్రామీణ ప్రాంతంలో పూర్తిగా స్తంభించాయి. కోడూరు నుంచి రేణిగుంట వరకు మూడు నెలలుగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో లేవు. ఫలితంగా 10 వేల మంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు బదిలీ అయ్యారు. బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకున్నారు. కార్యాలయంలో సిబ్బంది కనపడరు. వినియోగదారులకు సమాచారం తెలపలేక టెలికాం అధికారి సెలవులపై వెళ్లినట్లు సమాచారం.

అసలు సమస్య ఎక్కడ?

అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే మండలంలోని కుక్కలదొడ్డి, శెట్టిగుంట, ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న కంట్రోల్ బోర్డులు పూర్తిగా కాలిపోవడంతో నెట్‌వర్క్ సేవలు స్తంభించాయి. 2002లో మోటొరోలా టెక్నాలజీ సహాయంతో 2జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కంట్రోల్ బోర్డులు మరమ్మతులు నోచుకోకపోవడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. అధికారుల దృష్టికి సమస్య వెళ్లిన కూడా స్పందన లేదు. జోనల్ స్థాయి అధికారులకు స్పందిస్తే కాని సమస్య పరిష్కారం కాదు.



తాళాలు వేసిన రైల్వేకోడూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్

నేను ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు వాడుతున్నాను. గ్రామంలో ప్రతి చోటా నెట్‌వర్క్ సిగ్నల్ అందుబాటులో ఉండేవి. ప్రైవేట్ నెట్‌వర్క్‌లు ఎన్ని వచ్చిన మా గ్రామంలో అంతా బీఎస్ఎన్ఎల్ మాత్రమే వాడేవారు. 4జీ, 5జీ నెట్‌వర్క్ సేవలు అందుబాటులో వచ్చినా కూ డా బీఎస్ఎన్ఎల్ సిమ్ ప్రత్యేకంగా ఉపయోగించే వాళ్ళం. ఇతర నెట్‌వర్క్‌లకు బదిలీ కాకుండా ప్రత్యేకంగా డ్యూయల్ మొబైల్ సిమ్ కార్డులు వాడేవాళ్ళం. మూడు నెలల నుంచి బీఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిగా అందుబాటులో లేరు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

జయప్రకాష్, మాజీ మార్కెట్ ఉపాధ్యక్షుడు శెట్టిగుంట

జోనల్ అధికారులు స్పందించాలి

వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య గురించి జోనల్ స్థాయి అధికారులకు సమాచారం చేరవేశాం. 2002లో నిర్మించిన కంట్రోల్ బోర్డులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తవి ఏర్పా టు చేయాలి. ప్రసుత్తం 4జీగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. 10 వేల ఉన్న వినియోగదారులు పూర్తిగా వేరే నెట్‌వర్క్‌ను పోర్టబులిటీ అయ్యారు.

జూనియర్ టెలికాం అధికారి రవీంద్ర

జగన్,భారతి ప్రమేయంతోనే వివేకా హత్య

గండికోట నిర్వాసితులకు రూ.12 లక్షలు ఇప్పిస్తా ● ఎమ్మెల్యేకి మాట్లాడే భాష తెలియదు

కొండాపురంలో రోజుకు రూ.20 లక్షల ఇసుక దోపిడీ : మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి

కొండాపురం,ఏప్రిల్ 6: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతి ప్రమేయం ఉందని ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవగుడి ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. స్థానిక రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు ప్రస్తుతం ఇచ్చే రూ.10 లక్షల పరిహారానికి అదనంగా మరో రెండు లక్షలు కలిపి రూ.12 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే టీడీపీ హయంలో రూ.1,82,000 పరిహారాన్ని రూ.6,75000కి పెంచామన్నారు. గండికోట నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న దేవగుడి ఆదినారాయణరెడ్డి

కల్పిస్తామన్నారు. ముంపువాసుల ఇళ్ల స్థలాలకు పట్టాలు, అర్హత ఉండి కూడా పరిహారం అందని వారి కోసం తిరిగి సోషియల్ ఎకానమిక్ సర్వే చేయిస్తామని గండికోట ముంపువాసులకు హామీ ఇచ్చారు. గండికోట బ్యాక్‌వాటర్‌తో పెన్నా నది అవలి గ్రామాల రాకపోకలకు తన హయంలో శంకుస్థాపన చేసిన సంకేపల్లే బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. కొండాపురంలో రైళ్ల నిలుపుదల కోసం కృషిచేస్తానన్నారు. కొండాపురం నుంచి పులివెందుల రోడ్డును నేషనల్ హైవేకి కలుపుతామన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మాట్లాడే భాష తెలియదన్నారు. కొండాపురం ప్రాంతంలో రోజుకు రూ.20 లక్షల ఇసుక దోపిడీ జరుగుతోందని ఆయన మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, భూపేశ్‌ను కడప ఎంపీగా గెలిపించాలన్నారు. జీజేపీ నేతలు దేవగుడి శివనారాయణరెడ్డి, దేవగుడి రాజేష్‌రెడ్డి టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహా రెడ్డి, నేతలు పద్మజ, రమణారెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రామాంజులరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గండి వేలంలో రూ.11.65లక్షల ఆదాయం

చక్రాయపేట, ఏప్రిల్ 6: గండి క్షేత్రంలో తలనీలాలు, ఎండుకొబ్బరికి నిర్వహించి వేలం పాటల్లో రూ.11.65లక్షల ఆదాయం చేకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. గండి కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేలం పాటల్లో ఏలూరు వాసి వేణుగోపాల్ తలనీలాలకు రూ.11లక్షలు, వేంపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి నిల్వ ఉన్న ఎండుకొబ్బరికి రూ.65 వేలు పాడి పాట దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణతేజ, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కంటైనర్

నందలూరు, ఏప్రిల్6: కడప-చెన్నై జాతీయ రహదారిలోని తహసీల్దారు కార్యాలయ మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చెన్నై నుంచి మహారాష్ట్రకు టైర్లలోడుతో వెళుతున్న కంటైనర్ లారీ అదుపు తప్పి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై పడిన కంటైనర్‌ను, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడి నుంచి తీయించి వేశారు. కంటైనర్‌ను తొలగిస్తున్న సమయంలో ట్రాఫిక్‌కు కొంతఅంతరాయం ఏర్పడింది.

బానిసలుగా వుండలేకే వైసీపీని వీడుతున్నాం

ఎమ్మెల్యే రాచమల్లును విభేదించి టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 6: వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి కింద బానిసలుగా వుండలేకే వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు మూడో వార్డు వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ రామాంజనే యరెడ్డి ప్రకటించారు. మూడో వార్డులో వీరి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డితో కలిసి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అసంతృప్తిగా వుండి పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొనని జంబాపురం రామాంజనే యరెడ్డి టీడీపీలో చేరుతున్నారని అనుమానించి ఎమ్మెల్యే రాచమల్లు వారి ఇంటికెళ్లి అంతుచూస్తానని బెదిరించడం అతని దౌర్జన్య రాజకీయాలకు నిదర్శనమన్నారు. టీడీపీలో చేరిన జంబాపురం రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ వార్డులో కనీసం రూ.5 లక్షల మేరకు కూడా అభివృద్ధి పనులు పెట్టలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో వచ్చిన పించన్లు రేషన్ కార్డులు తప్ప ఒక్క కొత్త పెన్షన్ వైసీపీ ప్రభుత్వంలో ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ చైర్మెన్ కామిశెట్టి బాబు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సానా విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాదుబోయిన సుబ్బారావు. జనసేన ప్రతినిధులు సుంకర మురళి జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకట లక్ష్మీ మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డి

చిన్నారిపై కుక్క దాడి



గాయపడిన బాలుడు

ఖాజీపేట, ఏప్రిల్ 6: ముస్లిం కాలనీలో ఉదయం ఉజాస అనే బాలుడిపై విచక్షణారక్షితంగా దాడి చేశాయి. అదే కాలనీలో ఇప్పటికే ఇద్దరిపై దాడి చేయడంతో వారు చికిత్స పొందుతున్నారు. మండల పరిధిలో ఏదో ఒక చోట పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారు. రాత్రివేళల్లో స్కూటర్లలో వెళ్లాలంటే కుక్కలు వెంబడించడంతో వాహనదారులు ఎందరో కిందపడి గాయాలపాలయ్యారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి కుక్కలు పట్టుకుని పిల్లల ప్రాణాలను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మండుటెండలో ఉపాధి పనులు



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

44 డిగ్రీల ఎండలో ఉపాధి కూలీల అవస్థలు ● నాలుగు గంటలు పనిచేయలేమంటున్న వైనం

కిలోమీటర్ల దూరం కనీస సౌకర్యాలు కరువు

రాజుపాలెం, ఏప్రిల్ 6: మండలంలో ఉపాధి పనులు మొదలయ్యాయి. 15 పంచాయతీలకు 1948 మంది ఉపాధి పనుల్లో పాల్గొననున్నారని ఉపాధి అధికారులు తెలిపారు. ఎండలు విపరీతంగా ఉండడం, 44 డిగ్రీల ఎండలు కాస్తుండడంతో ఉపాధి కూలీలతో నాలుగు గంటలు పని చేయిస్తుండడంతో తట్టుకోలేకపోతున్నామని కూలీలు వాపోతున్నారు. ఉదయం 7 నుంచి 12 వరకు పనుల్లో పాల్గొంటుండడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు. గ్రామంలోని చివరి ప్రాంతంలో ఈ పనులు ఏర్పాటు చేయడంతో వర్షాలు లేకపోవడం, మట్టి తవ్వకాలు గట్టిగా ఉండడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. ఇన్ని అవస్థలు పడి పనిచేసినా కనీసం మంచినీరు కానీ, నీడకు కావాల్సిన సౌకర్యాలు కానీ చేయడంలేదని కూలీలు వాపోతున్నారు. రైతు పనులు లేకపోవడంతో ఉపాధి పనులు చేసుకొనైనా పూట గడుపుదామనుకున్న కూలీలకు విపరీతమైన ఎండతో కూలీలు అవస్థలు పడుతున్నారు. కూలీలకు కనీస సౌకర్యాలైనా ఏర్పాటు చేయాలని పలువురు కూలీలు అడుగుతున్నారు.

రెండో ఫొటో అడుగుతోంది

ఉదయం 7గంటలకు ఫొటో తీస్తే 11 గంటలకు మళ్లీ రెండో ఫొటో అడుగుతోంది. ఇందుకోసం అంత వరకు ఉపాధి కూలీలు పనులు చేయాల్సిందేనంటున్నారు. మంచినీటి సౌకర్యం, తార్పాల్‌పట్టలు ఏర్పాటుకు అధికారుల సూచనలు లేవు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కావడంతో ఈ సౌకర్యాలు కల్పించలేకున్నామని ఉపాధి కూలీలే నీటి వసతి, పట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

లక్ష్మి నారాయణ, ఉపాధి హామీ ఏపీఓ

కనీస సౌకర్యాలు కనుమరుగు

గత ప్రభుత్వంలో మజ్జిగ, తార్పాల్ పట్టలు ఏర్పాటు చేసేవారు. అప్పుడు వర్షాలు పడుతుండడంతో పనులు కూడా సులభంగా ఉండేవన్నారు. వర్షాలు లేకపోవడం, గట్టిగా ఉండడం, ఎండ వేడి ఎక్కువ సెగలు కక్కుతుండడంతో కూలీలు పనులు చేయలేకపోతున్నారు. కనీసం అర్ధగంట విరామం కల్పించాలి.

శ్రీనివాసులు, బాలాయపల్లె

పంట కాల్వల్లో పనులు కల్పించండి

ఉపాధి పనులు ఇంకుడు గుంతల్లో చేయిస్తున్నారు. వర్షాలు లేక గుంతలు ఎండిపోయి గట్టిగా ఉండడంతో పనులు చేయలేకున్నారు. కనీసం కాల్వల్లో పనులు కల్పిస్తే కొంత సులభంగా ఉంటుందని తెలిపారు. ఎండ వేడిమికి సమయం కొంత తగ్గించాలని అన్నారు.

ఉప్పలపాటి నరసింహులు

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందిస్తున్న కౌండిన్య తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6: విజయవాడ విద్యాధరపురంలో ఉండే సీనియర్ పాత్రికేయుడు వేలూరి కౌండిన్య తన కుమారుడు క్రిష్ణశాస్త్రి, కోడలు అనూషతో కలిసి శనివారం తన స్వగృహంలోని 680 పుస్తకాలను సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకుడు హరిభూషణరావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకుడు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కౌండిన్య బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో వేటూరి పాట, నవ్యనీరాజనం, కూచిపూడి భాగవతుల చరిత్ర, శ్రీపాద చిన్నకథలు, విస్మృత కథ, బెజవాడ చరిత్ర తదితర గ్రంథాలున్నాయన్నారు. కౌండిన్యను వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, భాషాపరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలక్రిష్ణ శాస్త్రి, చింతకుంట శివారెడ్డి తదితరులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

వ్యాపారి నుంచి రూ.8.50 లక్షల నగదు స్వాధీనం



నోటీసు ఇస్తున్న ఎస్ఐ రంగస్వామి

కడప(క్రైం), ఏప్రిల్ 6: కడప నగరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద వాహనాల తనిఖీలో శనివారం ఓ వ్యాపారి నుంచి రూ.8.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన శశిధర్ అనే పూతరేకుల వ్యాపారి నగదును డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ నగదును స్వాధీనం చేసుకుని ఆర్డీఓకు అప్పగించారు.

నిప్పంటుకుని వృద్ధురాలు మృతి

కడప(క్రైం), ఏప్రిల్ 6: స్థానిక చిలకలబావి వద్ద నివాసం ఉంటున్న మురాద్‌బీ (70) ప్రమాద వశాత్తూ చీరకు నిప్పంటుకుని మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. శనివారం వడలు కాల్చుతుండగా ప్రమాదవశాత్తూ ఆమె చీరకు నిప్పంటు కుంది. మంటలు చెలరేగి తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందిందన్నారు మృతురాలి కుమార్తె మునీరాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ వ్యక్తి మృతి



చెన్నూరు, ఏప్రిల్ 6: చెన్నూరు మండలంలోని ఇర్కాన్ సర్కిల్ సమీప రాజంపేట రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజంపేట రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆ వ్యక్తి చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని నల్లపురెడ్డి పల్లె 33కెవి ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, సరస్వతిమైన్స్ పరిధిలో ఈ అంతరాయం ఉంటుందని, రైతులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

పులివెందుల పట్టణంలో...

పట్టణంలోని బైపాస్‌రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌లైన షిఫ్టింగ్ జరుగుతున్నందున ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అర్బన్ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపాస్‌రోడ్డు ప్రాంతంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగాలలో...

లింగాల, ఏప్రిల్ 6: మండలంలోని లింగాల, చిన్నకుడాల, గుణకనపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కెవి లింగాల ఫీడర్‌లో సాంకేతిక కారణాల మరమ్మతులు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని వివరించారు.

వైభవంగా ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం



రాచిన్నాయపల్లెలో ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం

చెన్నూరు, ఏప్రిల్ 6:మండలంలోని రాచిన్నాయపల్లె గ్రామంలో అతి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా దాన్ని తిరిగి జీర్ణోద్ధరణ చేసి శనివారం ఆలయం ముందు ధ్వజ స్తంభం ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. రామనపల్లె గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు హరి, మాజీ న్యాయమూర్తి శ్రీకృష్ణ తదితరుల పూర్వపు వంశీయులు ఈ రాచిన్నాయపల్లెలో శివాలయాన్ని చాలా ఏళ్లక్రితం నిర్మించారు. అప్పట్లో ప్రముఖ ఆలయంగా పూజలందుకున్న శివాలయం కాలక్రమేణా గర్భగుడి గోపురం, మండపం తదితరాల భాగాలు దెబ్బతినడంతో వాటిని తిరిగి ఆలయ నిర్మాణ వంశస్థులే దాదాపు రూ.30లక్షలు ఖర్చు పెట్టి తిరిగి జీర్ణోద్ధరణ చేసి ధ్వజప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి మండలంలోని పలువురు నాయకులు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. అలా గే హోమం, పూర్ణాహుతి నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.

అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 6: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంతోపాటు పెన్నానదిలో అక్రమంగా దారులు ఏర్పాటు చేసి తరలిపోతున్న ఇసుక అక్రమ రవాణాను వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో వెంకటలక్షుమ్మకు ఆయన వినతి పత్రం అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 6 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి లయంలో శనిత్రయోదశి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. నవగ్రహాలన్నీ నరసింహస్వామి ఆధీనంలో ఉండడం వల్ల స్వామివారి అభిషేకంలో పాల్గొన్న వారికి ఏలిననాటి శని తొలగిపోతుందని ఆలయ ప్రధాన అర్చకుడు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు దాతలు మునగా చలమయ్య కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుర్తు పెట్టుకుని గుండెల్లో పెట్టుకుంటా

● చెన్నూరు ఎస్సీ, ఎస్టీ కాలనీ నేతలతో టీడీపీ నేత పుత్తా ● పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్సీ, ఎస్టీలు





చెన్నూరు: పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్టీకాలనీవాసులు... సీకేదిన్నె: ఇప్పెంటలో టీడీపీ పథకాలను వివరిస్తున్న పుత్తా చైతన్యరెడ్డి తదితరులు

చెన్నూరు, ఏప్రిల్ 6 :టీడీపీకి ఆయువుపట్టుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుని గుండెల్లో పెట్టుకుంటానని, వారు అందించిన సహకారం మరువలేనిదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. టీడీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గౌరవం, వారి అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందించామన్నారు. చెన్నూరు దళితవాడ, సుగాలితాండాల వాసులు టీడీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో వారిని పార్టీలో చేర్చుకునేందుకు శనివారం ఆయన చెన్నూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆ రెండు కాలనీల్లో ఇంటింటా తిరిగిన టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఆదరించి అఖండ మెజార్టీ గెలిపించాలని విన్నవించారు. టీడీపీ గెలుపు అభివృద్ధికి మలుపు అని, ప్రతి కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

చెన్నూరు దళితవాడకు చెందిన 20 కుటుంబాలు, సుగాలితాండాకు చెందిన పది కుటుంబాల వారు మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడి సమక్షంలో శనివారం టీడీపీ కండువా వేసుకున్నారు. దళితవాడ నుంచి పార్టీలో చేరిన వారిలో సుధాకర్, నాగసుబ్బయ్య, శశికుమార్, బ్రహ్మయ్య, కిరణ్, మనోహర్, సుబ్బరాయుడు తదితరులు, అలాగే ఎస్టీకాలనీలో శ్రీనునాయక్, రవినాయక్‌తో పాటు పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శివారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, అరుంధతీనగర్ సీనియర్ నేత సురేష్, పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం:సీకేదిన్నె, ఏప్రిల్ 6: ఇఫ్తార్ ఎంతో పుణ్యకార్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. 18వ డివిజన్ బాకరాపేటలోని మసీదులో ముస్లింలకు శనివారం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింలకు రంజాన్ తోఫా, దుల్హన్, వివాహానికి రూ.50 వేలు, ఇమామ్‌లు, మౌసంలకు జీతాలు అందించారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, టీడీపీ డాక్టర్స్ సెల్ నాయకుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి, టి.వి.కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక: సైకో పాలన పోయిన సైకిల్ పాలన రావాలని కమలాపురం టీడీపీ అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పాలనతో జనం విసిగిపోయారని, ఎన్నికలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్‌ను గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు చంద్రబాబు చేపట్టే పథకాల గురించి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, మోహన్ బాబు, భద్ర, దర్బార్, జబీవుల్లా, రెడ్డి బాష, చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రెడ్డిప్రసాద్, అబ్దుల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



పెండ్లిమర్రి: పథకాలను వివరిస్తున్న పుత్తా కుటుంబ సభ్యులు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 6: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి నారా చంద్రబాబునాయుడితోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మండలంలోని కొండూరు పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె దివ్యశ్రీ, కోడలు శ్రీచైతన్య ఇంటింటికీ తిరుగుతూ టీడీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, యశోద, శివకుమారి, నాయకులు సుబ్బరామిరెడ్డి, నాగసుబ్బయ్య, మహేంద్ర, సింగపూర్ రాజారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అండగా నిలవండి

● పులివెందులలో మార్పు తీసుకురండి: భూపేష్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 6: కూటమితో కలిసి ఎన్నికల్లో ముందుకు వెళ్తున్న టీడీపీకి అండగా నిలిచి ఓట్లు వేయాలని కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలోని దళితవాడ, క్రిస్టియన్ కాలనీల్లో బీటెక్ రవి కుమారుడు రామ్‌రెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తదితరులతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలోని పథకాల గురించి వివరించారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. పులివెందులలో మార్పు తీసుకొచ్చేందుకు టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు ఎస్‌బి జయరామిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ సెల్ మాజీ కార్యదర్శి షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, దర్బార్ బాష, జయచంద్రారెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, మండల ఉపాధ్యక్షులు భద్ర, పట్టణ అధ్యక్షులు ఆర్వీ రమేష్, ఈశ్వరయ్య, గిరి, మురళి, అరుణ్, కొండయ్య, రమణ, బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్, సుష్మ, దొంతుసుమన్ తదితరులు పాల్గొన్నారు.



దళితవాడలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి తదితరులు

'టీడీపీకి పూర్తి సహకారం అందిస్తాం'

చెన్నూరు, ఏప్రిల్ 6 : జరగబోయే ఎన్నికల్లో టీడీపీకి మండల బీజేపీ పార్టీ పూర్తి సహాయ సహకారాలు అందించి అటు కమలాపురం ఎమ్మెల్యే ఇటు కడప ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తుందని ఆ పార్టీ మండల కన్వీనరు భాస్కర్ పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి చెన్నూరు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసిన బీజేపీ నేతలు శాలువాతో సత్కరించారు. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన కలిసినందున ఆ పార్టీకి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని, ఇప్పటికే కమలాపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయానికి ప్రచారం చేస్తున్నామన్నారు. మండలం నుంచి మంచి మెజార్టీని టీడీపీ అభ్యర్థికి వచ్చేలా కృషి చేస్తామని, ఆ దిశగా రోజూ ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు. పుత్తాను కలిసిన వారిలో బీజేపీ నేతలు భరత్‌రెడ్డి, వీర ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ 2024 ప్రణాళికపై శిక్షణ, సమీక్ష

గోపవరం, ఏప్రిల్ 6 : మండలంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం ఖరీఫ్ 2024 ప్రణాళికపై శిక్షణ కల్పిం చారు. అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సుస్థిర భూసార పద్ధతులను గుర్తించి అలాగే ఉత్తమ యాజమాన్య పద్ధతులు, మార్కెట్ ధరలు, నాణ్యత నియంత్రణ, సకాలంలో చీడపీడల గుర్తింపు నివారణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు సహాయ వ్యవ సాయ సంచాలకుడు ఎం.నాగరాజు తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులు 15వతేదీ లోపు రైతులకు విక్రయించి డెబిట్ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 6 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు సమీపంలో వెలసిన నారాయణరెడ్డి యోగీంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా ముగిసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొమ్ము శివనారాయణరెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారు జామున స్వామివారిని గజవాహనోత్సవంపై గ్రామోత్స వాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో నాదస్వరం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

అరాచక పాలనను తరిమికొట్టండి

● టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పయనింపజేద్దాం ● రామ్‌రెడ్డి పిలుపు



టీడీపీకి ఓటు వేయాలని కోరుతున్న రామ్‌రెడ్డి

లింగాల, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను తరిమికొట్టాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి కుమారుడు రామ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తేర్నాంపల్లె, అక్కులగారిపల్లె గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ ఎన్డీయే కూటమి ఉమ్మడి మేనిఫెస్టో పథకాలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్క చాన్స్ ఇవ్వండి అని ఓట్లు వేయించుకొని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటింటికి పంపాలని పిలుపునిచ్చారు. మహిళలను, రైతులను, నిరుద్యోగులను ఎలా నమ్మించి ఓట్లు వేయించుకున్నారో వివరించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని దీనితో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని అభివృద్ధివైపునకు పయనింపజేద్దాం అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జోగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కమలాపురంలో వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటన

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 6: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు, కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని వైఎస్ షర్మిలారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కమలాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆ వివరాలు ఇవీ... నేటి ఉదయం కడపలోని జయరాజ్ గార్డెన్ నుంచి బస్సుయాత్రను ప్రారంభించి 9-50 గంటలకు మండల కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ సమావేశం నిర్వహించి 10-50 గంటలకు బయలు దేరి పెండ్లిమర్రి మండల కేంద్రానికి 11-40కు చేరుకుంటారు. 12-40 గంటల నుంచి 1 గంట 20 నిమిషాల వరకు నంది మండలం, 1-30 గంటల నుంచి 3 వరకు తంగేడుపల్లి, 3-15 గంటల నుంచి 3-45 వరకు వివిఎన్ పల్లి మండలాల్లో పర్యటించనున్నారు. అలాగే 4 గంటల నుంచి 4-30 గంటల వరకు పెద్ద చెప్పలి, 4-45 గంటల నుంచి 5-15 వరకు కమలాపురం ఎక్స్‌రోడ్డుపై సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5-30 నుంచి 6గంటలకు కమలాపురం దర్గాలో ప్రార్థనలు నిర్వహించి 630 గంటల నుంచి 7 గంటల వరకు వల్లూరులో, రాత్రి 7-30 గంటలకు చెన్నూరు మండల కేంద్రంలో సమావేశాలు నిర్వహించనున్నారు.

మెడికల్ రెప్రజెంటేటివ్‌ల జీవితాలతో ఆటలొద్దు

● తక్షణమే 4 నెలలకు రావాల్సిన వేతనాలివ్వాలి
● కొండపేట లక్ష్మీనరసింహ

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 6: మెడికల్ రెప్రజెంటేటివ్‌ల జీవితాలతో చెలగాటమాడే పద్ధతికి రిసోల్యూట్ ఫార్మాసూటికల్స్ యాజమాన్యం స్వస్తిపలకాలని ఆ ఫార్మాసూటికల్స్ రాయలసీమ మేనేజర్ కె.లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. ఇప్పటికే 4 నెలల వేతనాలతో పాటు ఇతర ఖర్చులు ఇవ్వకపోగా సమాచారం ఇవ్వకుండా అందులో పనిచేసే మేనేజర్లు, మెడికల్ రెప్స్‌ను అకారణంగా తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించారన్నారు. శనివారం స్థానిక కోఆపరేటివ్ కాలనీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు నిలిపివేయడంతో రెప్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలో పనిచేస్తున్న 14 మందికి పైగా మెడికల్ రెప్స్‌ను, అలాగే పలువురు మేనేజర్లను జీఎం ఆపరేషన్స్ మంజునాథ్ ఇష్టానుసారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను కూడా తొలగించి తన స్థానంలో అనంతపురానికి చెందిన నయాజ్ అనే వ్యక్తిని మేనేజర్‌గా నియమించారన్నారు. ముఖ్యంగా అన్ని లావాదేవీలు సక్రమంగా ఉన్నా కావాలనే మెడికల్ రెప్స్‌ను, మేనేజర్లను అసమర్థులుగా చిత్రీకరించి తొలగించడం సరికాదన్నారు. ఈ విషయాన్ని కార్మిక శాఖ అధికారులు, అలాగే ఏపీ ఎంఎస్ఆర్‌యూకు తెలియపరచినట్లు పేర్కొన్నారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సక్రమంగా పూర్తిచేస్తున్నప్పటికీ సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కావున జిల్లా అధికారులు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

చక్రాయపేట, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సురభి గ్రామంలో బీజేపీ జండాను ఆవిష్కరించారు. బీజేపీ సీనియర్ నేత రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వాన్ని బలపరచి ఎన్డీఏ కూటమి టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

9వ తేదీ ఉగాది పంచాగ శ్రవణం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 6: క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పంచాగశ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం అయిదు గంటలకు విద్వాన్ మిట్టల పణిభాస్కరశర్మ ఆధ్వర్యంలో పంచాంగశ్రవణం ఉంటుందన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే తాట తీస్తాం

● టూటౌన్ సీఐ గడ్డం ఇబ్రహీం



కడప (క్రైం), ఏప్రిల్ 6: ప్రజలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ గడ్డం ఇబ్రహీం హెచ్చరించారు. అల్మాస్‌పేటలోని తాలిమ్ మసీదు వద్ద మూడురోజుల క్రితం జరిగిన గొడవ నేపథ్యంలో శనివారం ఈ హెచ్చరికలు జారీ చేశారు. కొంత మంది వ్యక్తులు అదే పనిగా ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని ఇది తగదన్నారు. ఇలా రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి గొడవలు సృష్టించాలని చూస్తే మాత్రం ఉపేక్షించేది లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని వాట్సప్ గ్రూపులు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఈ సందర్భంగా తెలిపారు.

మనిషికి ధర్మాచరణ ముఖ్యం

● విద్యా వామదేవ తీర్థ స్వామి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యావామదేవ తీర్థ స్వామి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6: మనిషి జీవితంలో ధర్మాచరణ ద్వారా పరిపూర్ణుడు అవుతాడని, ధర్మబద్ధంగా తాను సంపాదించిన ధనంలో కొంత సత్కార్యాలకు ఉపయోగించాలని మహారాష్ట్ర ఎల్లోరా టాకాశ్రమం పీఠాధిపతి విద్యా వామదేవ తీర్థస్వామి అన్నారు. శనివారం కడప నగరం రాజరాజేశ్వరి దేవస్థానంలో తెలుగు విశ్రాంత అధ్యాపకుడు కొప్పరపు సూర్యనారాయణ రచించిన కర్మబంధం.. తెగని బంధం విద్యావామదేవ తీర్థ స్వామి ఆవిష్కరించారు. అనంతరం ఆయన కర్మసిద్ధాంతం గురించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ధార్మిక విషయాల గురించి వివరించారు. పుస్తక రచయిత కొప్పరపు సూర్యనారాయణ మాట్లాడుతూ తాను రచించిన పుస్తకం తమ గురువు అయిన విద్యావామదేవ తీర్థస్వామికి అంకితం ఇవ్వడం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. వైవీయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ భక్తిమార్గంలో ప్రయాణించే వారికి కర్మబంధం తెగని సంబంధం పుస్తకం కరదీపికగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం డాక్టర్ గోపీనాథ్, మృత్యుంజయేశ్వర సర్వమంగళదేవి పీఠం అధ్యక్షుడు రామక్రిష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు వెల్లాల వెంకటేశ్వరచారి, ప్రసాద్, విజయకుమార్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన జగన్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌కుమార్

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 6 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని ఆర్గనైజేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (ఓపీడీఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రామ్‌కుమార్ ధ్వజమెత్తారు. ప్రజాస్వా మ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సమావేశాలు కడప నగరం హరిత హోటల్‌లో శుక్ర, శనివారాల్లో జరిగాయి. ఈ సమావేశానికి ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ సీమలో పెండింగులో ఉన్న ప్రా జెక్టులు అన్నింటినీ పూర్తి చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, జి.సంగీతరావు, శివారెడ్డి, ఆమెన్‌పీరా, కరుణాకర్‌రావు, నరసింహులు, ఉపేంద్ర, నారాయణమ్మ పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో బ్రాహ్మణుల సంక్షేమం నిర్వీర్యం'



మాట్లాడుతున్న జనార్ధన్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6 : వైసీపీ హయాంలో బ్రాహ్మణుల సంక్షేమం నిర్వీర్యమైందని బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కో ఆర్డినేటరు, టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటరు జనార్ధన్ తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వాన్ని బ్రాహ్మణులు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి సీఎం జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. బ్రాహ్మణ సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, రాను న్న ఎన్నికల్లో బ్రాహ్మణులకు మేలు చేసే టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

9వ తేదీ ఉగాది పంచాంగ శ్రవణం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 6: క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో పంచాంగశ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం అయిదు గంటలకు విద్వాన్ మిట్టల ఫణిభాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగశ్రవణం ఉంటుందన్నారు. అలాగే పి.శివానీ, సాయిశ్రీచరణ్, జేవీ సుభాన్‌షలతో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 6: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంతోపాటు పెన్నానదిలో అక్రమంగా దారులు ఏర్పాటు చేసి తరలిపోతున్న ఇసుక అక్రమ రవాణాను వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో వెంకటలక్షుమ్మకు ఆయన వినతి పత్రం అందజేశారు.

జగన్ సామ్రాజ్యాన్ని కూల్చాలంటే టీడీపీని గెలిపించండి

కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి



ప్రొద్దుటూరు , ఏప్రిల్ 6 : జగన్ సామ్రాజ్యాన్ని కూల్చాలంటే టీడీపీని గెలిపించాలని కడప పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో దేవగుడి వారి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్లగా వైఎస్ కుటుంబానికే కడప ఎంపీ స్థానాన్ని జిల్లా ప్రజలు పట్టం కడుతున్నారన్నారు. అయినా జిల్లాకు ఎలాంటి అభివృద్ధి చేయకపోగా విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రం ఇచ్చిన ఉక్కు ఫ్యాక్టరీ సైతం తీసుకురాలేక పోయారన్నారు. సీఎం జగన్‌కు ఆయన సోదరుడు ఎంపీ అవినాశ్ తమపై వున్న కేసుల నుంచి బయట పడటానికి కేంద్రం ముందు మోకరిల్లడం తప్ప రాష్ట్రానికి గానీ, కడప పార్లమెంటు పరిధిలో గానీ ఏమీ సాధించలేకపోయారన్నారు. రాష్ట్రంలో ప్రతినియోజకవర్గం ఎమ్మెల్యేకు దోచుకోవడానికి అధికారమిచ్చారన్నారు. కడప ఎంపీగా ఒక్కసారి ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో బుల్లెట్‌లా దూసుకెళ్ళే యువ నాయకుడు భూపేశ్‌రెడ్డిని కడప ఎంపీగా గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, నంద్యాల కొండారెడ్డి ,వీఎస్ ముక్తియార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, కామిశెట్టి బాబు, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : పుట్టా



పథకాలు వివరిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

చాపాడు, ఏప్రిల్ 6: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటానని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. తూర్పు అనంతపురం, పడమర అనంతపురం గ్రామాల్లో శనివారం సాయంత్రం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఆయనకు పూలు చల్లుతూ బాణసంచాతో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ఈ ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు మాచనూరు సుబ్బరాయుడు, జనసేన నాయకుడు మల్హోత్ర, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్ యాదవ్, వెంకటసుబ్బారెడ్డి, సుదర్శన్, నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, రవీంద్ర, మల్లికార్జునరెడ్డి, రమణ, సుబ్బరాయుడు, నాయబ్‌రసూల్, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీమకు కేటాయించిన నీటిని విడుదల చేయాలి

- సీఎంకు కుంచం వెంకట సుబ్బారెడ్డి లేఖ



మైదుకూరు, ఏప్రిల్ 6 : రాయలసీమలోని వివిధ ప్రాజక్టులకు కేటాయించిన మేరకు నీటిని విడుదల చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, కడప పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి కుంచెం వెంకట సుబ్బారెడ్డి సీఎం జగన్ మోహన్ రెడ్డికిలేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు. మైదుకూరులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ లోని వివిధ ప్రాజక్టులకు శ్రీశైలం నుంచి 135 టీఎంసీలు నీటిని విడుదల చేయాల్సిఉండగా కేవలం 113 టీఎంసీలు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యోగివేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ చింతాసుధాకర్



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 6: సాంకేతిక రంగంలో వస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని యోగివేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ చింతాసుధాకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని, దేశం ప్రపంచంలోనే 5వ ఆర్థికశక్తిగా ఆవిర్భవించిందన్నారు. దేశంలో యువతే ప్రధాన శక్తిగా ఉందని వారు తమకు నచ్చిన రంగంలో రాణించడానికి కృషి చేయాలన్నారు. రాయలసీమలోనే వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిందన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ కె.వి.రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని కళాశాలకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫసర్ పి.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.66 కోట్లు, రూ.7 కోట్ల రూసా నిధులతో కళాశాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం హెచ్‌వోడీ జయచంద్రారెడ్డి, సివిల్ విభాగం హెచ్‌వోడీ జయరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెల్లపాడులో టీడీపీ, బీజేపీ నాయకుల ప్రచారం



తెల్లపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కూటమి సభ్యులు

కలసపాడు, ఏప్రిల్ 6 : మండలంలోని తెల్లపాడు గ్రామంలో శనివారం టీడీపీ, బీజేపీ నాయకులు కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు కార్తీక్, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ రంతు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు భద్రయ్య, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపీ జిందాల్ యూనివర్సిటీతో ఎస్‌ఆర్‌ఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 6: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయఘర్‌లో ఉన్న ఓపీ జిందాల్ యూనివర్సిటీతో సాయిరాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం చేసుకుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండు రంగన్‌రవి తెలిపారు. శనివారం రాయఘర్‌లోని ఓపీ జిందాల్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఓపీ జిందాల్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఆర్‌పీ పాతీదార్ చేతుల మీదుగా ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి , ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి ఒప్పంద పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల మరో మైలురాయిని చేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపీ జిందాల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అనురాజ్ విజయ్ వర్గీయ, స్టీల్‌ఛైర్ ప్రొఫెసర్ డాక్టర్ దాస్, డీన్ అకడమిక్ డాక్టర్ సిద్ధార్థచక్రవర్తి, కార్పొరేట్ ఎడ్యుకేటివ్ డైరెక్టర్ డాక్టర్ మహేష్, భీవాకుర్కర్, ఎలక్ట్రిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్‌రావు, అసిస్టెంట్ డీన్ రాకేష్‌నాయక్, ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ అంకిరెడ్డి నరేంద్ర పాల్గొన్నారు.ఈ ఒప్పందంపై ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

భగత్ సింగ్ నగర్‌వాసులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలి

సీపీఐ డిమాండ్

బద్వేలు, ఏప్రిల్ 6: పట్టణంలో 10 సంవత్సరాలుగా భగత్ సింగ్ కాలనీ ఏర్పాటుచేసుకుని నివాసముంటూ దుర్భర జీవితం గడుపుతున్న పేదలపై అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైందికాదని, వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, ఏరియా కార్యవర్గ సభ్యులు విజయమ్మ, అనిల్, నాగసుబ్బయ్య, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ 2024 ప్రణాళికపై శిక్షణ, సమీక్ష

గోపవరం, ఏప్రిల్ 6 : మండలంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం ఖరీఫ్ 2024 ప్రణాలికపై శిక్షణ కల్పించారు. అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సుస్థిర భూసార పద్ధతులను గుర్తించి అలాగే ఉత్తమ యాజమాన్య పద్ధతులు, మార్కెట్ ధరలు, నాణ్యత నియంత్రణ, సకాలంలో చీడపీడల గుర్తింపు నివారణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులు 15వతేదీ లోపు రైతులకు విక్రయించి డెబిట్ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న



దుస్తులు ఐరన్ చేస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 6 : బద్వేలు నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ తరపున పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం పోరుమామిళ్లలోని రంపాడు రోడ్డు, చిదానందనగర్, 64వ పోలింగ్‌బూత్ పరిధిలోని ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: బద్వేల్ నియోజకవర్గంలో జనసేన,బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోఉన్న బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న కమలం గుర్తుకు ఓటెయ్యాలని శనివారం చిన్నాయపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,మండల అధ్యక్షుడు మురుకూటి రాజారెడి,మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డితో,బీజేపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డితో కలిసి ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని 6 అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, నాయకులు ఓ.రోహిత్‌రెడ్డి, ఎం.విజయ్ కుమార్‌రెడ్డి,రాజారెడ్డి,పాల గురివిరెడ్డి, లక్ష్మీరెడ్డి,పెద్దగురివిరెడ్డి, గుర్రాల రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి,క్రిష్ణయ్య, రామచంద్ర నాయుడు,వేణుగోపాల్‌రెడ్డి,అడవి రాముడు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, ఏప్రిల్ 6 : మున్సిపల్ పరిధిలోని పల్లె రవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి లయంలో శనిత్రయోదశి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. నవగ్రహాలన్నీ నరసింహస్వామి ఆధీనంలో ఉండడం వల్ల స్వామివారి అభిషేకంలో పాల్గొన్నవారికి ఏలిననాటి శని తొలగిపోతుందని ఆలయ ప్రధాన అర్చకుడు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు దాతలు మునగా చలమయ్య కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆరాధన మహోత్సవాలకు సర్వమత అన్నదానం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 6 : సిద్ధయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు బ్రహ్మంగారి మఠం మండలంలోని ముడుమాల గ్రామంలో సిద్ధయ్య గారిమఠంలో ఏప్రిల్ 9 నుంచి 10వతేదీ బుధవారం వరకు ఘనంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు సిద్ధయ్యస్వామి మఠం అన్నదాన కమిటీ, కార్యనిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సర్వమత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రెసిడెంట్ కె.సిద్ధేశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్ కె.సిద్ధయ్య, కార్యదర్శి నాయబ్‌రసూల్, సిద్ధయ్య గారిమఠం అన్నదాన కమిటీ కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



నారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 6 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు సమీపంలో వెలసిన నారాయణరెడ్డి యోగీంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం వైభవంగా ముగిసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ బొమ్ము శివనారాయణరెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారు జామున స్వామివారిని గజ వాహనోత్సవంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో నాదస్వరం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.

బి.మఠంలో పోలీసు కవాతు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, మఠం ఎస్‌ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గూండా పోలీసు కవాతును నిర్వహించారు. అలాగే బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల కూడలిలో ప్రజలతో సీఐ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో దాదాపు 200 మంది వరకు ఆర్‌పీఎఫ్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం చేస్తానని మహిళలకు జగన్ మోసం



మాట్లాడుతున్న సి.గోవర్ధన్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 6: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారం కోసం పాదయాత్ర చేస్తున్న సమయంలో అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను మోసం చేశారని బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. శనివారం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీత, అంజనేయులు, రాజు, యువరాజు, సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సుగుమంచిపల్లె కాలనీ కాలువలో పూడిక తీత

కొండాపురం, ఏప్రిల్ 6: మండలంలోని సుగుమంచిపల్లె ఆర్ అండ్ ఆర్ కాలనీలోని డ్రైనేజీ కాలువలో శనివారం అధికారులు పూడిక తీత పనులు చేపట్టారు.శుక్రవారం పూడిపోయిన మురికి కాలువ.. రోడ్డుపైకి నీరు అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమయింది. దీనికి స్పందించిన అధికారులు శనివారం కాలువలో పూడిక తీత పనులు చేయించారు.దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు

బొజ్జ రోశన్నను ఆదరించండి: రితీశ్‌రెడ్డి



కువైత్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ యువ నాయకుడు రితీశ్‌రెడ్డి

బద్వేలు టౌన్, ఏప్రిల్ 6 : ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశాడని టీడీపీ యువ నాయకులు రితీశ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కువైత్‌లోని ఖైతాన్ ప్రాంతంలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ కార్య కర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీ కుటుంబ సభ్యులు, బద్వేలు నియోజకవర్గంలోని బంధువులు, స్నేహితులకు చెప్పి బొజ్జ రోశన్నను ఆదరించి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.



మండుతున్న ఎండలు... అల్లాడుతున్న జనం



ఎండలకు నిర్మానుష్యంగా ఉన్న బద్వేలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 6 : వేసవి కాలం ప్రారంభం అయిందంటే రోజురోజుకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు ఉన్నాయి. ఎండలు ముదిరిపోయి అధికవేడి, వడగాడ్పులతో ప్రజలు బయట తిరగాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. 11గంటలకే దాదాపు 39 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు అవుతుండడం తో ఉదయాన్నే బయటికి వచ్చి త్వరగా పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలు నమోదు..: ఏప్రిల్ మాసం ప్రారంభంలోనే దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట దాటేసరికి 41, 42 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బయట తిరగాలంటే బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ మాసంలో 38, 39డిగ్రీల ఉష్ణోగ్రత మాత్రమే నమోదవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మాత్రం 3, 4 డిగ్రీలు అధికంగా నమోదవుతుండడంతో మే, జూన్‌లలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభమైన అప్రకటిత విద్యుత్ కోతలు..: వేసవి కాలం ప్రారంభం దశలోనే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు మొదలయ్యాయి. బద్వేలు పట్టణంలో 3, 4 విడతల్లో అరగంట చొప్పున దాదాపు రెండు గంటల వరకు విద్యుత్ కోతలు జరుగుతున్నాయి. ఇన్వర్టర్లు ఉన్న వారు అయితే ఇబ్బందులు పడడంలేదు కానీ సాధారణ, మధ్య తరగతి ప్రజలు అప్రకటిత విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారు.

నిర్మానుష్యమవుతున్న రోడ్లు..: ఏప్రిల్ ప్రారంభ దశలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మధ్యాహ్న సమయంలో పట్టణంలోని రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఉదయాన్నే పట్టణానికి వచ్చి పనులు ముగించుకుని 11గంటల్లోపే ఇళ్లకు చేరుతున్నారు. పట్టణ ప్రజలు కూడా 11గంటల తరువాత బయట తిరగడం లేదు. ఉద్యోగులు కూడా మధ్యాహ్న సమయంలో ఇళ్లకు కూడా వెళ్లకుండా ఆఫీసు పట్టునే ఉంటూ సాయంత్రం వరకు ఉంటున్నారు. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ నిర్మానుష్యమవుతున్నాయి.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిప్పలూరు రామసుబ్బారెడ్డి

బి.కోడూరు, ఏప్రిల్ 6 : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిప్పలూరు రామసుబ్బారెడ్డిని నియమించినట్లు వారు తెలిపారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. బద్వేలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఉట్టి శ్రీనివాసులు, గోవిందాయపల్లె నవీన్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి కొనసాగుతున్న వలసల పరంపర

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 6 : వైసీపీ దుష్ట పాలనకు ఆఖరి గడియలు దగ్గర పడ్డాయని ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లును ఓడించి ఇంటికి పంపాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు., శనివారం 39 వవార్డు హనుమాన్‌నగర్‌లో వైసీపీ నాయకుడు సిద్దయ్య ఆధ్వర్యంలో 150 మంది టీడీపీలో చేరారు. వీరందరికి వరదరాజులరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, వీఎస్‌ముక్తియార్ , కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు , ఈవీ సుధాకర్‌రెడ్డి, సానా విజయ భాస్కర్‌రెడ్డి, జనసేన ప్రతినిధి సుంకర మురళి, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మండలంలోని రజాసాహెబ్‌పేట పంచాయతీ పరిధిలోని తిరువెంగలాపురం ఎస్సీ కాలనీకి చెందిన 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం పోరుమామిళ్ల మండలంలో రజాసాహెబ్‌పేట పంచాయతీలో వైసీపీకి చెందిన 50 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొజ్జ రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: వైసీపీ అరాచక ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తిమ్మరాజుపల్లె గ్రామం వైసీపీ నుంచి 30 కుటుంబాలు టీడీపీ మండల అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీవీఎస్ రవికుమార్‌రెడ్డి, సింగరయ్య, కుమార్, శ్రీనివాసరాజు,రవి, కళ్యాణ్, చెన్నయ్య, నడిపి గురయ్య, శశి, శ్రీను, రామచంద్ర, రామక్క, విజయమ్మ, సుజాత, ఓబులమ్మ, రమాదేవి పాల్గొన్నారు.







ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సిద్ధయ్య తదితరులు, పోరుమామిళ్ల, బద్వేలులో టీడీపీలోకి చేరిన వారు